క్లుప్తంగా

మునిరత్నం మృతికి భూమన నివాళి



నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: మాజీ కౌన్సిలర్, దళిత నాయకుడు మునిరత్నం గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మృతుడి నివాసానికి వెళ్లి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం మునిరత్నం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మునిరత్నం మృతికి నివాళులర్పించిన వారిలో కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్కే బాబు, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నల్లాని బాబు, కుమార్ ఉన్నారు.

పారదర్శకంగా ఇంటర్వ్యూలు

తిరుపతి (అలిపిరి): టీటీడీ ఆలయాలు, వసతి సముదాయాల్లో పనిచేసేందుకు ప్రైవేటు మహిళా అభ్యర్థులకు బుధ, గురువారాల్లో వెటర్నరీ యూనివర్సిటీలో శ్రీలక్ష్మీ శ్రీనివాస మాన్‌పవర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 43 పోస్టులకు గాను 2701 మంది మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలకు 1855 మంది హాజరయ్యారు. ఇంటర్వ్యూలను ఏఆర్ డీఎస్పీ చిరంజీవి, సీఈవో శేషశైలేంద్ర, టీటీడీ వీజీవోలు బాలిరెడ్డి, నందకిషోర్ తదితర అధికారులు పర్యవేక్షించారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించండి

తిరుపతి అర్బన్: ప్రతి ఒక్కరికి ఓటింగ్ యంత్రాలకు పూర్తి అవగాహన కల్పించాలని తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటింగ్ యంత్రాలను పరిశీలించారు. కార్యాలయం వచ్చే ఓటర్లు అందరికి ఓటు ఎలా వేయాలి అనే అంశాలపై నిశితంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అందరికి అందుబాటులో ఉండాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



పాకాల: రమణయ్యగారిపల్లికి చెందిన వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం పాకాల మండల ఈడిగగౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఆమె అంత్యక్రియలకు రూ.7,500 ఆర్థిక సాయం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు శ్రీనివాసులు, పునీత్‌కుమార్, నాగేశ్వరరావు, యువరాజులు, గోపి, రామ్మూర్తి, దొరస్వామి, బాబు, పండు పాల్గొన్నారు.

ఇంటింటికీ కులగణన సర్వే

తిరుపతి తుడా: నగరంలోని కుల గణన, ప్రజల స్థితిగతుల వివరాలు నమోదు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించినట్లు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ రవి పేర్కొన్నారు. తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో గురువారం కుల గణన సర్వేపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. వార్డు అడ్మిన్ సెక్రటరీలు, సెక్టోరల్ ఆఫీసర్లు, కలెక్టర్ కార్యాలయం అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని కులగణన సర్వేపై సాధ్యాసాధ్యాలు, విధివిధానాలపై చర్చించారు. ఈ నెల 19 నుండి 28 వ తేదీ వరకు ప్రతి ఇంటికి వెళ్లి పక్కాగా కుల గణన చేపట్టనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

వినియోగదారుడి విజయం

తిరుపతి లీగల్: సేవా లోపం అప్పీలు కేసులో రాష్ట్ర వినియోగదారుల కమిషన్ తీర్పు మేరకు విశాఖపట్నం సహకార బ్యాంకు ఫిర్యాదికి సొమ్ము చెల్లించినట్లు ఫిర్యాది పి.కృష్ణమూర్తి తెలిపారు. కేసులోని వివరాల మేరకు ... తిరుపతికి చెందిన న్యాయవాది పి.కృష్ణమూర్తి విశాఖపట్నం సహకార బ్యాంక్, తిరుపతి శాఖలో ఖాతాదారుడిగా ఉన్నాడు. బ్యాంకు ద్వారా ఆరోగ్య బీమా సౌకర్యం కలిగి ఉన్నాడు. అతను అనారోగ్యంతో ఓ ఆపరేషన్ చేసుకున్నాడు. దానికి రూ.14,847లు ఆసుపత్రిలో ఖర్చు పెట్టాడు. బీమా కింద తాను ఆసుపత్రిలో ఖర్చు పెట్టిన సొమ్మును చెల్లించాలని బ్యాంక్ అధికారులను కోరాడు. అయితే బ్యాంక్ అధికారులు దీనిపై స్పందించలేదు. దీంతో అతను తిరుపతి వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేశాడు. ఫిర్యాది కృష్ణమూర్తికి బ్యాంక్ అతను ఖర్చు పెట్టిన రూ.14,847లకు 9 శాతం వడ్డీ లెక్కన చెల్లించాలని 2022 ఆగస్టు 18వ తేదీన తీర్పు చెప్పారు. ఆ తీర్పుపై బ్యాంక్ అధికారులు రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో అప్పీలు దాఖలు చేశారు. వాదనలు విన్న రాష్ట్ర కమిషన్ ఆ అప్పీలును కొట్టివేసింది. దీంతో సహకార బ్యాంక్ అధికారులు రూ.54,934 చెక్కును కృష్ణమూర్తికి అందించారు.

గడప గడపలో అపూర్వ స్వాగతం

- చంద్రగిరిలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పర్యటన



ధర్మరాజులగుడి వీధిలో హారతులు పట్టి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

చంద్రగిరి: జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు.. ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన అభివృద్ధి పనులు.. కష్టంలో అండగా నిలిచే వ్యక్తిత్వం.. తాము ఎన్నటికీ మరవలేమని.. చెవిరెడ్డి బిడ్డ మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా చేసి విధేయతను చాటుకుంటామని చంద్రగిరి ప్రజలు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి మాట ఇచ్చారు. చంద్రగిరి పట్టణంలోని ధర్మరాజుల గుడి వద్ద నుంచి గురువారం ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డితో కలసి డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెంటరాగా గడప గడపకు వెళ్లి సంక్షేమ జాబితాలను అందించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి స్థానిక జనం పూల వర్షం కురిపిస్తూ.. హారతులు పట్టి.. పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ ఘన స్వాగతం పలికారు. సమస్యలు వింటూ.. పరిష్కరించాలని సూచిస్తూ.. చంద్రగిరి పట్టణంలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు. గడప గడపకు వెళుతున్న సమయంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను వెంట బెట్టుకుని వెళ్లి, అన్ని అర్హతలు కలిగి సంక్షేమ పథకాలు అందని వారికి అక్కడికక్కడే సమస్య పరిష్కారం చేసేలా చర్యలు తీసుకున్నారు. చంద్రగిరి పట్టణంలోని పాతపేట, ధర్మరాజులగుడి వీధి, ఆకుతోటవీధి, రాములవారిగుడి వీధి ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, ఎంపీడీవో బాలాజీ నాయక్, ఎంపీటీసీలు బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, మాధవరెడ్డి, మట్టా మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొత్తపాటి వేణు, కొత్తపాటి హరి, కొత్తపాటి కోటి, ఏఎంసీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్ చైర్మన్ చేగు గోవర్ధన్ గుప్తా, ముదికుప్పం రామ్మూర్తి, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, బండారు హేమచంద్ర, గురవారెడ్డి, సిద్ధిక్ బాషా, మోహన్, బాహార్ తదితరులు పాల్గొన్నారు.

గోపుర నిర్మాణానికి నిధులివ్వాలని వినతి

14వ శతాబ్దపు కాలం నాటి శ్రీకోదండరామ స్వామి వారి ఆలయంలో టీటీడీ యాజమాన్యం రాజగోపురం నిర్మించాలని కోరుతూ చంద్రగిరి ప్రజలు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పల్లవుల కాలం నాటి ఈ రామాలయం దేవదాయ ధర్మాదాయ శాఖ నిర్వహణలో కొనసాగుతుండగా చంద్రగిరి ప్రజల విజ్ఞప్తి మేరకు టీటీడీలో విలీనం చేసుకున్నారు. ఈ క్రమంలో ఆలయంతో పాటు ఆలయం సమీపంలోని 2 ఎకరాలు భూమి టీటీడీకి అందుబాటులోకి వచ్చినట్లు ప్రజలు వివరించారు. టీటీడీ కల్యాణ మండపం చంద్రగిరిలో నిర్మించాలనే ఇక్కడి ప్రజల చిరకాల కోరికను మన్నించాలని కోరారు. ఆలయం పక్కల గల 2 ఎకరాల ఖాళీ స్థలంలో కల్యాణ మండపం నిర్మించాలని కోరారు. ఈ విషయమై టీటీడీ అధికారులతో చర్చించి పాలక మండలి ద్వారా అనుమతులు మంజూరు చేయించాలని కోరారు.

మోహిత్‌రెడ్డికి అండగా.. పెరుమాళ్లపల్లి

- చెవిరెడ్డి లక్ష్మి పాదయాత్రకు అపూర్వ ఆదరణ



పెరుమాళ్లపల్లిలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: తమ గ్రామంలో రాజకీయ అడుగులు నేర్చుకుని, అంచలంచెలుగా ఎమ్మెల్యే అభ్యర్థి స్థాయికి ఎదిగిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లివాసులు తమ అభిమానం, ఆప్యాయతను చాటుకున్నారు. గురువారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పెరుమాళ్లపల్లిలో గడప గడపకు ఆత్మీయ పలకరింపు పేరుతో పాదయాత్ర చేపట్టారు. సర్పంచ్ జోగి మోహన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆమెకు అపూర్వ స్వాగతం పలికారు. మంగళవాయిద్యాలు, పూల వర్షం కురిపిస్తూ అభిమానాన్ని చూపారు. తమ గ్రామ ఎంపీటీసీగా ఎన్నికై రాష్ట్రంలోనే అతిపెద్ద మండలమైన తిరుపతి రూరల్ మండలానికి ఎంపీపీగా, తుడా చైర్మన్‌గా ఎదిగిన మోహిత్‌రెడ్డికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. రానున్న ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మోహిత్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. అంతకుముందు చెవిరెడ్డి లక్ష్మి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చెవిరెడ్డి చేసిన ప్రగతి పనులను గడప గడపలో వివరించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆడుతూ.. అదరగొట్టారు

- కూత పెట్టి... కబడ్డీ ఫైనల్‌లో గెలిచిన రాయలపురం జట్టు



ఫైనల్‌లో గెలుపొందిన రాయలపురం జట్టును అభినందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చంద్రగిరి: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు పండగ వాతావరణంలో మండల వ్యాప్తంగా సాగుతున్నాయి. గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ ఉదయం నుంచి పోటీలను నిర్వహించారు. చివరగా సాయంత్రం చంద్రగిరి–రాయలపురం జట్లు ఫైనల్‌లో తలబడ్డాయి. ముందుగా ఏఎంసీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి సోదరుడు మట్టా మధుసూదన్ రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని, ఫైనల్ ఆటను ప్రారంభించారు.

ఉత్కంఠగా సాగిన ఫైనల్ పోటీలు

ఫైనల్ కబడ్డీ పోటీల్లో చంద్రగిరి–రాయలపురం జట్ల మధ్య జరిగిన పోటీ ఉత్కంఠగా సాగింది. మొదటి 15 నిమిషాల ఆటలో చంద్రగిరి జట్టు 9 పాయింట్లు, రాయలపురం జట్టు 17 పాయింట్లతో నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇరు జట్లు హోరాహోరీగా సాగాయి. ఓ వైపు అధిక పాయింట్లతో దూసుకుపోతున్న రాయలపురం జట్టును కట్టడి చేయడంతో చంద్రగిరి జట్టు పుంజుకుంది. ఈ క్రమంలో రాయలపురం జట్టుకు చెందిన క్రీడాకారులు గంగాధర్ ప్రత్యర్థి జట్టుపై విరుచుకుపడి గెలుపులో క్రియాశీలకంగా వ్యవహరించాడు. దీంతో చంద్రగిరి జట్టుకు–18 పాయింట్లు రాగా రాయలపురం జట్టుకు –30 పాయింట్లతో ఫైనల్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇరు జట్లను అభినందించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

రామచంద్రాపురం: వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా సాంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటలు వేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డా.నిరంజన్ బాబు విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సుమలత, ఫార్మా–డి కోఆర్డినేటర్ జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంట్రపాకంలో రంగవల్లుల సందడి

తిరుపతి రూరల్: కుంట్రపాకంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా గురువారం సర్పంచ్ శుభపద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని, అందమైన ముగ్గులతో అలరించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పద్మనాభరెడ్డి, కార్యదర్శి మురళి, నాయకులు పాల్గొన్నారు.

రేపు సంక్రాంతి సంబరాలు

తిరుపతి కల్చరల్: తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించే సంక్రాంతి సంబరాలను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ఈమేరకు గురువారం నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఉత్సవ కమిటీ ప్రతినిధులు సంక్రాంతి సంబరాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు కరాటే శ్రీనివాస్, విజయకుమార్, గుండాల గోపినాథ్‌రెడ్డి, నవీన్, వెంకటేష్, అజయ్‌కుమార్, చంద్రశేఖర్, ఆనంద్, గోపి, ప్రసాద్, నవీన్ రాయల్, సుమన్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి రూరల్: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సర్పంచ్ శుభపద్మనాభరెడ్డి

గోకులాపురంలో జల్లికట్టు



కోడెగిత్తను నిలువరిస్తున్న యువకులు



దూసుకెళ్తున్న కోడెగిత్తలు

రామచంద్రాపురం: మండలంలోని గోకులాపురంలో గురువారం జల్లికట్టు నిర్వహించారు. వందల మంది జనంతో గ్రామం జనసంద్రమైంది. ఉదయం పశువుల కొమ్ములకు రంగులను పూసి అందంగా తయారు చేశారు. కొయ్యతో చెక్కిన పలకలు, రంగు కాగితాలు, వివిధ రకాల దేవుళ్ల బొమ్మలను అతికించి, డప్పులు కొట్టి పశువులను వదిలారు. యువకులు పశువులను నిలువరించి వాటి కొమ్ములకు కట్టిన బహుమతులను సొంతం చేసుకోవడానికి పోటీ పడ్డారు. కొంతమంది పశువుల యజమానులు తమకు నచ్చిన నాయకుల చిత్రాలను, వివిధ దేవుళ్లను బొమ్మలను పలకలకు అతికించారు.



ప్రత్యేక అలంకరణలో ఉన్న కోడెగిత్త

రమాదేవి హాస్పిటల్లో ఉచిత కీళ్ల మార్పిడి



డాక్టర్ డీబీ శశిధర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: శ్రీరమాదేవి హాస్పిటల్లో ఈఎస్‌ఐ ఉన్న ఉద్యోగులు, వారి కుటుంబ భ్యులకు ఉచితంగా తుంటి కీళ్ల మార్పిడి, మోకాలు కీళ్ల మార్పిడి వంద శాతం ఉచితంగా అవసరమైన వారికి చేస్తామని ఆ హాస్పిటల్ అధినేత డాక్టర్ డీబీ శశిధర్ రెడ్డి తెలిపారు. జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ విరిగిన ఎముకలు, జారిన కీళ్లకు సర్జరీలు, యాక్సిండెంట్ కేసులు, వెన్నెముక సర్జరీలు, ఎముకల అరుగుదలతో నడిచేటప్పుడు తీవ్రమైన నొప్పితో బాధపడేవారు మోకాలి మార్పిడితో సరి చేయవచ్చని తెలిపారు. ఈఎస్‌ఐ కార్డు కలిగిన వారు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆపరేషన్ చేస్తామన్నారు.

వేదంలో వివో కొత్త మొబైల్ ఆవిష్కరణ



కొత్త మొబైల్ ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: తిలక్ రోడ్డులోని సెంట్రల్ పార్క్‌లోని వేదం మొబైల్స్‌షోరూంలో గురువారం టీటీడీ అడిషనల్ సీవీఎస్‌వో శివకుమార్‌రెడ్డి, షోరూం అధినేత ఆముదాల ప్రభాకర్ చేతుల మీదుగా వివో ఎక్స్‌సీరీస్ ఎక్స్100/ఎక్స్100 ప్రో నూతన మొబైల్‌ను ఆవిష్కరించి, మొదటి వినియోగదారుడు శివకుమార్‌కు అందజేశారు. ఆముదాల ప్రభాకర్ మాట్లాడుతూ వివో ఎక్స్ సీరీస్ మొబైల్స్‌పకి ఇన్‌స్టంట్ రూ.9000 క్యాష్ బ్యాక్ ఉందని, క్యాష్ బ్యాక్‌తో పాటు మంచి బహుమతులు కూడా అందిస్తున్నామని తెలిపారు.

ఆలస్యంగా మామిడి పూత



ఐతేపల్లెలో మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ జిల్లాధికారి దశరథరామిరెడ్డి

తిరుపతి అర్బన్: పగటి, రాత్రి పూట ఉష్ణోగ్రతల్లో తేడాలు ఎక్కువగా ఉండడంతోనే మామిడి పూత ఆలస్యంగా వస్తుందని ఉద్యానవనశాఖ జిల్లాధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లో మామిటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి సాగు చేస్తున్న రైతులు పూత సక్రమంగా రావడం లేదని, చాలా జాప్యం జరుగుతుందన్నారు. ఆయన రైతులతో మాట్లాడుతూ సాధారణంగా రాత్రి, పగటి ఉష్ణోగ్రతల తేడా 10 నుంచి 12 డిగ్రీలుంటే పూత బాగా వస్తుందని చెప్పారు.


సంక్రాంతి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



సంక్రాంతి ఉత్సవాలపై డీఎస్పీ యశ్వంత్‌తో చర్చిస్తున్న యారాశి చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి: గ్రామ దేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి సంక్రాంతి ఉత్సవాలను పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టనున్నట్లు చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. ముందుగా ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు అమ్మవారి సంక్రాంతి ఉత్సవాలను వేడుకగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఐదు రోజులపాటు ప్రత్యేక బలగాలు, బృందాలతో గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. సీఐ రాజశేఖర్, ముదికుప్పం రామ్మూర్తి, గొబ్బిళ్ల కిషోర్, ఆలయ బోర్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అజంతా షూ కంపెనీకి ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కోరా విజయ

తిరుపతి కల్చరల్: అజంతా షూ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ కోరా విజయకు కేంద్ర ప్రభుత్వం తరపున ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు లభించింది. ఈమె తిరుపతికి చెందిన వారు. చెన్నైలో వ్యాపారం చేస్తున్నారు. షూస్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన కోరా విజయకు ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు అందజేశారు.అలాగే ఉత్తమ టర్నోవర్ అందించిన వెంకట రమేష్ కోరాకు నేషనల్ ఎక్స్‌పోర్ట్ ఎక్సలెన్స్ బెస్ట్ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ హోటల్‌లో నిర్వహించిన 2022–23 ఏడాదికి సంబంధించిన అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర ప్రభుత్వం తరఫున అడిషనల్ సెక్రటరీ మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ రాజీవ్ ఠాకూర్ చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నారు. ఆలిండియా మొత్తానికి గాను ఈ రెండు కంపెనీలు కైవసం చేసుకున్నాయి.

సకల సదుపాయాలతో షాదీ మంజిల్



షాదీ మహల్‌లో పనులను పరిశీలిస్తున్న డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, ముస్లిం నేతలు

తిరుపతి కల్చరల్: అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన షాదీ మంజిల్‌ను త్వరలో ముస్లింలకు అందుబాటులోకి తేనున్నట్లు డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఈఎస్‌ఐ ఆసుపత్రి వద్దనున్న ముస్లింల షాదీ మహల్‌లో చేపడుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు పట్టించుకోకపోవడంతో ముస్లింల కోసం ఏర్పాటు చేసిన షాది మహల్ శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. దీనిని మరిన్ని మౌలిక సదుపాయాలను కల్పించి పేద ముస్లిం కుటుంబాలు ఆనందంగా తక్కువ ఖర్చుతో శుభకార్యాలు చేసుకొనేలా పనులు వేగవంతం చేశామన్నారు. కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ ఇమామ్ సాహెబ్ ఎస్కే ఇమామ్, కౌన్సిల్ సభ్యుడు ఎస్కే బాబు, షాదీ మహల్ చైర్మన్ గఫూర్, ప్రొఫెసర్ ఫరీద్, సలీం బాషా, మహ్మద్ రఫీ, ఏపీఎస్ మాలిక్, బషీర్, ఖాజా, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో అదనపు ఆదాయం



మాట్లాడుతున్న డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి

పాకాల: పుట్టగొడుగుల పెంపకంతో అదనపు ఆదాయం పొందవచ్చని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఇరంగారిపల్లి గ్రామంలో పుట్టగొడుగుల పెంపకంపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని శ్రీ వెంకటేశ్వర కళాశాల ప్లాంట్ పాథాలజీ విభాగం అధ్యాపకులు, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఎస్సీ ఉపప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకం అదనపు ఆదాయంతో పాటు సమతుల్యత ఆహారాన్ని అందజేస్తాయని తెలిపారు. ప్లాంట్ పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ రెడ్డికుమార్ పుట్టగొడుగులు రకాలు, వాటికి పెరుగుతున్న ఆదరణపై అవగాహన కల్పించారు. తిరుపతి డివిజన్ ఏడీఏ మనోహర్‌బాబు, డాక్టర్ కె.జ్యోత్స్న, డాక్టర్ ఎం.ప్రదీప్, ఉద్యాన అధికారిణి శైలజ, వ్యవసాయ ఉప అధికారి రమేష్‌నాయక్, నంద, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

పాకాల: ఎంపీడీఓ కార్యాలయంలో సమగ్ర కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గురువారం ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి సమక్షంలో ప్రభుత్వ మండల స్థాయి అధికారులు, ఉద్యోగులతో ఈ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ప్రభాకర్ మాట్లాడుతూ సమగ్ర కుల గణన చేయడంతో సామాజిక భద్రత, సమతుల్యత ఏర్పడుతుందని, ప్రభుత్వం తగిన సాయం అందించేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు. ఈ నెల 19వ తేదీ నుంచి కులగణన సర్వే జరుగుతుందని, ప్రతీ ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. స్టేట్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రఘుపతి, ఎంపీడీఓ, ఖాజామస్తాన్, రహీం, ఏఓ కరుణాకర్, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పాకాల: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ యశ్వంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని 53 పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని పేర్కొన్నారు. అలాగే సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఎన్నికల సమయంలో అల్లర్లు చేసే ఆకతాయిలను, రౌడీ షీటర్లను ముందస్తుగా బైండోవర్ చేసుకోవాలని సీఐ ఓబులేసుకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రామకృష్ణ, హెచ్‌సీలు సోమశేఖర్, సారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సామిరెడ్డిపల్లి పోలింగ్ కేంద్రం వద్ద డీఎస్పీ యశ్వంత్, సీఐ ఓబులేసు